క్లుప్తంగా

రోడ్డు విస్తరణపై రైతులతో సమావేశం

కోరుట్ల రూరల్: జాతీయ రహదారి 63 రోడ్డు విస్తరణలో భాగంగా మండలంలోని గుమ్లాపూర్‌లో తహసీల్దార్ కిషన్ శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రహదారి విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని రైతులకు సూచించారు. గుమ్లాపూర్ గ్రామ శివారులోని భూములకు మార్కెట్ వ్యాల్యూ బహిరంగ మార్కెట్ కంటే ప్రభుత్వ ధర తక్కువగా ఉందని, రైతులు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ విలువ కూడా తక్కువగా ఉండటంతో రైతులు కోల్పోతున్న భూములకు ధరలు తక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వ మార్కెట్ ధరలు కూడా పెంచాలని లేకుంటే రోడ్డు విస్తరణ పనులను అడ్డుకుంటామని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ

మల్యాల: వేసవిలో ప్రతి కూలీకి పని కల్పించాలని డీఆర్డీఏ అడిషనల్ పీడీ మదన్‌మోహన్ అన్నారు. మండలంలోని మానాలలో నర్సరీ, ఉపాధి హామీ పనులను పరిశీలించారు. జిల్లాలో అత్యధికంగా మల్యాలలో ఒకేరోజు 236 మంది కూలీలు పనికి హాజరు కావడంపై సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఏపీవో శ్రీనివాస్, జలపతి రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్మిస్తున్న 200 మెట్రిక్ టన్నుల ఎరువుల గోదాం పనులను కేడీసీసీ బ్యాంకు సీఈవో ఎస్.సత్యనారాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో సహకార క్రాంతి డిపాజిట్ పథకం ప్రవేశపెట్టామని, దీనిపై ఇతర బ్యాంకుల కన్నా ఎక్కువ వడ్డీ వస్తుందని తెలిపారు. సొసైటీ రుణాలు తీసుకున్న సభ్యులు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్,డీఈ శ్రీనివాస్, బ్యాంక్ ఇంజినీర్ రమేశ్, సంఘ కార్యదర్శి భూమేశ్ పాల్గొన్నారు.

జాతర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండ వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకనకసోమేశ్వర స్వామి జాతర ఉత్సవాల వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం మాట్లాడుతూ శ్రీ కనక సోమేశ్వర స్వామి జాతర ఉత్సవాలను ఈ నెల 6 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎలాల జలపతి రెడ్డి, ఎంపీటీసీ మరిపెల్లి సతెమ్మ మల్లయ్య, నాయకులు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, సిరిపురం రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తరలింపును అరికట్టాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్ గ్రామ శివారులో మడేలయస్వామి, బీరప్ప స్వామి ఆలయం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, దానిని అరికట్టాలని రజక సంఘం, కుర్మ సంఘం సభ్యులు కోరారు. కథలాపూర్‌లో తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు రెండు కుల సంఘాల సభ్యులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలించి ఆలయాలకు రోడ్డు లేకుండా తవ్వేస్తున్నారని వారు పేర్కొన్నారు.

ఉత్సవ కమిటీ ఏర్పాటు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాస శ్రీ పొలేస్తేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ప్రకటించారు. కమిటీ సభ్యులుగా ధరవేని రాములు, మ్యాడ జల, బోదాసు రాజన్న, బోదాసు నర్సయ్య, ఏనుగు నాగరెడ్డి, ముక్కెర ముత్యం, బోనగాని భూమగౌడ్, చెరుకు రాజేశ్వర శర్మను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ

- ఆరు మండలాలకు రూ. 7.05 కోట్లు
- తీరనున్న అవస్థలు..
- ప్రభుత్వ విప్ చొరవతో నిధులు మంజూరు



దోమలకుంటలో ఈజీఎస్ నిధులతో నిర్మించిన సీసీరోడ్డు

పెగడపల్లి: గ్రామాల్లోని అంతర్గత రహదారులకు మహర్దశ పట్టనుంది. గ్రామాల్లో మట్టిరోడ్ల స్థానంలో సీసీరోడ్లు వేయనున్నారు. మొన్నటివరకున్న మట్టి రోడ్లు సీసీరోడ్లుగా మారుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అంతర్గత వీధులు అస్తవ్యస్తంగా ఉండి అవస్థలు పడుతున్న పల్లెవాసులు సీసీరోడ్లు నిర్మిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ. 7.05 కోట్లు ప్రభుత్వం ఉపాధిహామీ నుంచి మంజూరు చేసింది. వీటిని సీసీ రోడ్లు, డ్రైయినేజీలు నిర్మించుటకు వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు అనేక గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణం జరిగినా.. మరికొన్ని ప్రాంతాల్లో మట్టి రోడ్లే కనిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కొద్దిపాటి నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు వేస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేయకపోతుండటంతో కొద్దికొద్దిగా నిర్మించేది. అంతర్గత వీధులు చిన్నగా ఉంటడం అవి మట్టి రోడ్లు కావడంతో ప్రజలు చాలా రకాలుగా అవస్థలు ఎదుర్కొనేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు దాదాపు దూరమవుతున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోని ప్రధాన రోడ్లు ఇప్పటికే సీసీరోడ్లుగా మారాయి. మిగిలిన కొద్ది పాటి రోడ్లకు కూడా ఉపాధిహామీ నిధులు కేటాయిస్తుండటంతో మట్టిరోడ్లు కనుమరుగు కానున్నాయి.

ప్రతిపాదనలు ఇలా..

నియోజకవర్గంలోని ధర్మపురి, పెగడపల్లి, గొల్లపల్లి, ధర్మారం, వెల్గటూర్, బుగ్గారం మండలాల్లో 140 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు వేసేందుకు ఉపాధిహామీ నిధులు వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులు మంజూరు చేసింది. వీటికి సంబంధించి అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహించి పలు ప్రాంతాల్లో సీసీ రహదారులు అవసరమని గుర్తించారు. ఇందుకోసం మండలాల వారిగా పెగడపల్లిలో 23 ప్రాంతాలను గుర్తించి రూ. 1.45 కోట్లు, వెల్గటూర్‌లో 22 ప్రాంతాలను గుర్తించి రూ. 1.60 కోట్లు, ధర్మపురిలో 20 ప్రాతాలను గుర్తించి రూ. 1.50 కోట్లు, గొల్లపల్లిలో 13 ప్రాంతాలను గుర్తించి రూ. 1.50 కోట్లు, బుగ్గారంలో 11 ప్రాంతాల్లో రూ.1.05 కోట్లు, ధర్మారంలో 30 ప్రాంతాలను గుర్తించి రూ. 1.45 కోట్లు మంజూరు చేసింది. మొత్తం మీద నియోజకవర్గంలో రూ.7.05 కోట్లు ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వారం రోజులుగా ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

గడువులోగా పూర్తి చేయిస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు ఈజీఎస్ నుంచి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 119 పనులకు రూ. 7.05 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులన్నీ మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాల్సి ఉంది. నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గడువులోపు మొత్తం పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం.

– అబ్దుల్ రహమాన్, ఈఈ పీఆర్

రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత



గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు మెరుగుపరిచేందుకు ప్రత్యేక ప్రాధాన్యత కలిస్తున్నాం. ఇప్పటికీ చాలా గ్రామాల్లోని వీధుల్లో మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. దశలవారీగా అంతర్గత వీధుల్లో ఉన్న మట్టిరోడ్లను సీసీరోడ్లుగా మార్చి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. దీని కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాం. త్వరలో అన్ని గ్రామాల్లో సీసీరోడ్లు పూర్తవుతాయి.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్

మహిళా హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మహేశ్వరి

పెగడపల్లి: మహిళల హక్కులపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. మండలంలోని బతికపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళా దినోత్సవం నిర్వహించి మహిళల హక్కులు, మహిళల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాలు, గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిన్న పిల్లలను హింసించరాదు

ఇబ్రహీంపట్నం: చిన్నపిల్లలు, మహిళలను హింసించరాదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు పురస్కరించుకుని మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, హెల్ప్‌లైన్ నంబర్ ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబర్‌క్రైం హెల్ప్ లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లిలో శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా లింగ సమానత్వం, బాలికల పరిరక్షణ, హెల్ప్‌లైన్ నెంబర్ల పై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ టీచర్లు వనతి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

ఇబ్రహీంపట్నం: ధరణి పెండింగ్ దరఖాస్తులను శనివారం తహసీల్దార్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ పరిశీలించారు. మండలంలో ధరణిలో 45 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తులను రికార్డులను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐలు రమేశ్, గంగాధర్, సీనియర్ అసిస్టెంట్ అనురాధ, జూనియర్ అసిస్టెంట్లు లావణ్య, షబానా, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్‌లో స్పెషల్ డ్రైవ్

రాయికల్: పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ ఖయ్యూం ఆధ్వర్యంలో ధరణిలో 174 అప్లికేషన్లు పెండింగ్ లో ఉన్నాయని పరిష్కారం కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గంగారాం, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మల్లన్న పల్లకీ సేవ



మల్లన్న పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కోరుట్ల: పట్టణంలో మల్లన్న జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. యాదవ సంఘం నాయకుడు ముక్కెర రాజగోపాల్ ఇంటి నుంచి మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ ప్రారంభించారు. మల్లన్న పల్లకీ సేవ పట్టణంలోని ప్రధాన వీధుల నుంచి సాగింది. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కొక్కెర శంకర్, జాల ఆనంద్, గడెల రాజు, గడెల అశోక్, కొక్కెర మల్లయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మాదాపూర్‌లో ధాన్యాదివాసం

కోరుట్లరూరల్: మండలంలోని మాదాపూర్‌లో శ్రీ సీతా రామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం ధాన్యాదివాసం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్ విండో చైర్మన్ ఆదిరెడ్డి, పురోహితులు పాలెపు రామ కృష్ణా శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పుట్ట రాజరాజేశ్వరస్వామి జాతర ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో పుట్టరాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం అర్చనలు,అభిషేకాలు,హోమం, పార్వతిపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన పట్టణ సీఐ

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ సీఐగా సూరం వేణుగోపాల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల పట్టణ సీఐగా పనిచేసిన నటేశ్ సస్పెండ్ కాగా, రామగుండం ఐటీ కోర్ సీఐగా పనిచేస్తున్న వేణుగోపాల్‌ను పట్టణ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో శనివారం బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్, అనంతరం ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు డీఎస్పీ రఘుచందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కోరుట్ల సీఐ..

కోరుట్ల: కోరుట్ల సీఐగా సురేష్‌బాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎస్సై కిరణ్‌కుమార్ ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలిగా అనిత

జగిత్యాల: కాంగ్రెస్ మహిళా పట్టణ అధ్యక్షురాలిగా మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత నియమితులయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం ఆమెకు అందజేశారు. తన నియామకానికి కృషిచేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గాజుల రాజేందర్, దయ్యాల శంకర్, హరికృష్ణ, సరితా, రమేశ్‌రావు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న బీసీ స్టడీ సర్కిల్ ద్వారా గ్రూప్ వన్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా అభ్యర్థులు ఈ నెల 7వ తేదీలోగా కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08782268686 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

అడ్వాన్స్ ఇన్‌కం ట్యాక్స్ చెల్లింపులకు వడ్డీ చెల్లించాలి

కోరుట్ల: ముందస్తు వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం వడ్డీ చెల్లించాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ రావికంటి పవన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. దేశ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆదాయపు పన్నులు చెల్లిస్తున్న ఉద్యోగులకు బ్యాంకు వడ్డీ చెల్లించాలని కోరారు.

నాచుపెల్లి వాసికి డాక్టరేట్



చిగుర్ల రవి

కొండగట్టు: కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామానికి చెందిన ఓ పేద గొర్రెల కాపరి కుటుంబానికి చెందిన చిగుర్ల రవి అనే యువకుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారి తెలిపారు. రవి భూగోళ శాస్త్ర విభాగం ద్వారా యూజీసీ రీసెర్చ్ సెంటర్, ఫర్ ఇండియన్ ఓషియన్ స్టడీస్ మాజీ డైరెక్టర్ అండ్ ప్రొఫెసర్ గీతారెడ్డి అనంత్ పర్యవేక్షణలో ,స్పేసియల్ అనాలిసిస్ ఆఫ్ ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపెటీవ్, సొసైటిస్, ఇంపాక్ట్, ఆఫ్ ఆగ్రో సర్వీస్స్, అండ్ సోషియో ఎకనామిక్, ఎంపవర్‌మెంట్ అనే అంశాలపై పరిశోధనలు చేశారు.జాతీయ ,అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని వివిధ అంశాలపై తాను చేసిన పరిశోధనలపై ఉపన్యాసాలు ఇచ్చారు. రవి డాక్టరేట్ పొందడంపై గ్రామస్తులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి





జగిత్యాల రూరల్,ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయాల్లో నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు



ధర్మపురిలో కాంగ్రెస్ నాయకుల నివాళి

జగిత్యాలరూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు శనివారం జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో ఎంపీపీ మంగళారపు మహేశ్, ఎంపీడీవో రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్ : పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారావు,పట్టణ,మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో శ్రీపాదరావు జయంతి వేడుకలు అధికారులు అధికారికంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలపరిషత్ కార్యాలయంలో శ్రీ పాద రావు చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురి: దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఘనంగా నివాళి అర్పించారు.ధర్మపురి నంది కూడలి వద్ద కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ శ్రీపాదరావు చిత్రపటానికి నివాళి అర్పించారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న నర్సింగరావు

మల్లాపూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. అనంతరం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ చెందిన 200 మంది నాయకులు, కార్యకర్తలు మాజీ సర్పంచులు, ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. గ్రామాల అభివద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరం, మాజీ జెడ్పీటీసీ ఎ లాల జలపతి రెడ్డి, నాయకులు పుండ్ర శ్రీనివాస్ రెడ్డి, మరిపెల్లి మల్లయ్య ,కోటగిరి ఆనందు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గానికి సన్మానం

జగిత్యాలరూరల్: ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస పొలేస్తేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాజెంగి నందయ్య పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ సభ్యుడికి ..

దుబ్బరాజరాజేశ్వర స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడిగా నియమితుడైన తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు గంగన్నను జీవన్‌రెడ్డి సన్మానించారు. శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ఎమ్మెల్సీని కలిసిన ఉత్సవ కమిటీ సభ్యులు

రాయికల్: మండలంలోని కొత్తపేటలోని రాజరాజేశ్వర నాగాలయ ఉత్సవ పాలకమండలి సభ్యులు దానవేణి రాంలు, బొంగోని భూమాగౌడ్, ఏనుగు నర్సారెడ్డి, ముక్కెర ముత్యం శనివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులను జీవన్‌రెడ్డి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

జగిత్యాల: దివ్యాంగులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసంలో శనివారం నిర్వహించిన దివ్యాంగుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగుల విషయంలో సానుకూల దృక్పథంతో సాయం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, మాజీ చైర్మన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి: నేటి నుంచి నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 3 నుంచి మూడు రోజుల పాటు 0–5 ఏళ్ల లోపు చిన్నారులకు ప్రభుత్వం పోలియో చుక్కలు వేస్తోందన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల శివారులో అనుమతులు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు. పైడిమడుగు గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వన్యప్రాణుల దాహార్తికి సాసర్ ఫీట్లలో నీళ్లు

ఇబ్రహీంపట్నం: వన్యప్రాణులు నీళ్లు తాగేందుకు ఇబ్బంది పడకుండా ఉండేందుకు మండలంలోని వేములకుర్తి అడవిలో 2 చోట్ల శనివారం ఫారెస్ట్ బీట్ అధికారి రత్నాకర్ ఆధ్వర్యంలో సాసర్‌ఫీట్లలో నీటిని నింపారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో నీటి కోసం వన్యప్రాణులు అడవి విడిచి వెళ్లకుండా ఉండేందుకు నీటిని నింపామని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లిరూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. మెట్‌పల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో శనివారం దాడులు చేశామని 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు .కొండపల్లి మల్లేశ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రాజ్యసభ సభ్యుడికి పరామర్శ

జగిత్యాల: రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు తల్లి అండాళు ఉదయం హైదరాబాద్‌లో మృతిచెందగా, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళి అర్పించారు. అనంతరం దామోదర్‌రావును ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ధర్మపురి: ధర్మపురికి చెందిన రంగ రాజన్న, మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అంజలి తల్లి, కమలాపూర్‌కు చెందిన ఉయ్యాల శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు.

మెట్‌పల్లి సీఐ బదిలీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ బదిలీ అయ్యారు.ఈ మేరకు ఆయనను మల్టీజోన్ 1 ఐజీ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ఆయన స్థానంలో రామగుండం సీఎస్‌బీలో పనిచేస్తున్న నవీన్‌ను నియమించారు.